


# అబ్బా! తిన్నాడు గదరా దెబ్బా!

బి. సుదాకర్ ఐవోరు, సి.సుదాకర్ ఐవోరు అని యిద్దరు ఐవోర్లు.

ఒకాయన జీవశాస్త్రం చెప్తాడు, ఒకాయన బౌతికశాస్త్రం చెప్తాడు.

పాపం వీళ్లపాటికి వీళ్లు జీవశాస్త్రాలు బౌతికశాస్త్రాలు చెప్పుకొని సాయంత్రమైతే చాలు చేతులు దులుపుకొని, ఇళ్లకి పొయ్యి ఐవోరమ్మలు చేసిపెట్టిన పులిబొంగరాలో, పాకోడి ముక్కలో ఆరారగా నమలతా కూచుందామనుకుంటే కుమారస్వామి ఐవోరు ఊరుకుంటాడా? హెడ్మాస్టరు అన్నాక కళ్లల్లో నిప్పులు పోసుకోవాలి గదా.

'ఐట్. ఐవోర్లంతా సాయింత్రం ఆకరుగంట కొట్టంగానే యిళ్లకి లగుదోలతా ఉన్నారు. పనుండి చెప్దామన్నా పత్తాలేకుండా పోతా ఉన్నారు. అందుకనే ఇయ్యాళ్టి నుంచి యిల్లులా. గిల్లులా. ఒక్కో ఐవోరిని ఒక్కో కిలాసుకి 'కిలాస్ టీచరు'గా నియమిస్తా ఉన్నా. ఇంక మీదట ఆ ఐవోర్లు ఆ కిలాసుల్లో పిలకాయల మంచి చెడ్డలకి, హాజరీకి, మార్కులు గీర్కులకి బాద్యత వొహించాల. పిలకాయల్లోని ఆర్టుని గూడా పైకి తేవాల. ఇదీ డ్యూటీ' అని నోటీసు  పంపించినాడు.

ఐవోర్లంతా ఆ నోటీసు చదువుకొని మింగలాక కక్కలాక 'ఊ' అనుకొని సంతకాలు పెట్టినారు.

ఆ నోటీసు ప్రకారం బి.సుదాకర్ ఐవోరు మా సి సెక్షన్‌కి 'కిలాస్ టీచర్' అయినాడు.

సి.సుదాకర్ఐవోరు మా పక్కనే ఉండే బి సెక్షన్‌కి 'కిలాస్ టీచర్' అయినాడు.

'ఏకకణ జీవి అమీబా, మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ, స్వపరాగసంపర్కము పరపరాగ సంపర్కము' యిట్టాంటి జీవశాస్త్రం పాటాలు చెప్పమంటే మా బి.సుదాకర్ ఐవోరు పొద్దున్నించి సాయింత్రం దాకా చెప్పుకుంటా పోతాడుగానీ పాపం పిలకాయ లని ఎక్కువ సేపు మోటుగా కంట్రోలు చెయ్యమంటే చెయ్యలేడు.

ఇంక సంవచ్చరం పొడుగూతా కిలాసు మంచిచెడ్డలను ఆయన చూడగలడా?

పిలకాయల్లోని ఆర్టుని బయటపెట్టేదానికి, వ్యాసరచనపోటీకి ఆయనిచ్చిన టాపిక్ ఏందో తెలుసునా? 'సూర్యుని యొక్క వెలుగు- కాంతి- బూమండలంపై దానియొక్క ప్రబావము'

ఆయన బాద చూసి, పోనిలే పాపం, మనిషి మంచోడు, మనం పెద్దగా యిబ్బంది పెట్టగూడదు అని మా కిలాస్ టీచరుగా ఆయన్ని జాగ్రత్తగా కనిపెట్టుకుంటా వొచ్చేవాళ్లం మేము.

ఇంక బిసెక్షన్ 'కిలాస్ టీచరు' అయిన సి.సుదాకర్ ఐవోరి కష్టాలు యింకో రకంగా ఉన్నాయి.

ఆ సెక్షనులో 'బాలుర సంక్షేమ హాస్టలు'లో ఉంటా చదువుకునే పిలకాయలు కొంత మంది ఉన్నారు. 'కిలాస్ టీచరు' అనేవాడు పిలకాయల మంచి చెడ్డలు పట్టించుకోవాలి అని కుమారస్వామి ఐవోరు చెప్పినాడు కదా అందుకని యీళ్లంతా సి.సుదాకర్ ఐవోరి కాడికొచ్చి 'సార్. మా హాస్టలులో సాంబారు కుళాయి నీళ్ల కంటే గోరం సార్. మీరు కలెక్ట రుకి ఇంగ్లీషులో అర్జీ రాపిచ్చి యిచ్చినారంటే మా బతుకులు బాగపడతాయి సార్' అని అడగడం మొదలుబెట్టినారు.

'ఒకరి పక్కన ఒకరం పొణుకొని వేళ్ల సందన తీటలు, తామరలు వొస్తున్నాయి సార్. నెలకి రెండు డెట్ సబ్బులతో పాటు జాలిమ్‌లోషన్‌గూడా యియ్యాలని అర్జీలో రాయండి సార్' అని ఇంకో డిమాండు.

ఆ సెక్షనులోనే ముంగమూరు కాణ్ణుంచి వచ్చి హాస్టలులో ఉంటా చదువుకునే పెంచ లరెడ్డి అనే పిల్లోడు వుండేవాడు. వాడు శనివారం అయితే చాలు సి.సుదాకర్ ఐవోరి కాడి కొచ్చి 'సార్. మా అమ్మానాయనల మీద బెంగగా ఉంది సార్. టెన్ రుపీస్ యిచ్చినారంటే సాయింత్రం పొయ్యి ఆదివారం ఉండి సోమవారం పొద్దున ఫస్టు బస్సుకొచ్చేస్తాను సార్' అని యాపక తినడం మొదలుబెట్టాడు.

అంతటితో అయ్యిందా? నంబూరి శ్రీదర్ అనే స్టూడెంటు సంగతి ఇంకా గోరం. వాడు ఇస్కూలుకి రానేరాడు. వాళ్ల నాయన జేబులో నుంచి డబ్బులు నూకేసి నెల్లూరు కాంప్లెక్సు దియేటర్లలో మూడాటలు చూసుకొని తిరిగి కావలి రావడంలో మొనగాడు. వాడు సి.సుదాకర్ ఐవోరిని పక్కకి పిలచకెళ్లి 'సార్. ఒక హండ్రెడ్ రుపీస్ దాకా యిచ్చుకుంటాను

సార్. ఐవోర్లందరినీ సాయింత్రం బిపిఎస్‌కి తీసకెళ్లి ఐస్‌క్రీములు తినిపించండి. నేను ఇస్కూలికి రాకపోయినా హాజరీ వచ్చేటట్టుగా చూడండి. మీ కష్టం నేనుంచుకోను' అని అతి దీనంగా రిక్వెస్టు చేయడం ప్రారంబించినాడు.

ఈ బాదలన్నీ పడలాక బి.సుదాకర్ ఐవోరు, సి.సుదాకర్ ఐవోరు తురాయి చెట్ల కింద జేరి కుమారస్వామి ఐవోరి కంట పడకుండా బోరోమంటా ఏడస్తా ఉండేవాళ్లు.

ఈళ్ల ఏడుపుకి కుమారస్వామి ఐవోరు యింకో ఫిటింగు తగలించినాడు.

'సెప్టెంబర్ అయిదు సర్వేపల్లి రాదాకృష్ణ పుట్టినరోజు. అంటే ఐవోర్ల దినం. ఆ రోజున ఏ కిలాసు పిలకాయలు ఆ 'కిలాస్ టీచర్'ని సన్మానించుకోవాల. పిలకాయల అబిమానాన్ని కిలాస్ టీచర్లు ఏమాత్రం సంపాదించుకున్నారో తెలిసేదానికి అదొక గుర్తు' అని బాంబేసినాడు.

దాంతో యింకా కష్టాలు మొదలైనాయి.

మామూలుగా ఏ ఇస్కూల్లో అయినా 'ఎ సెక్షన్' పిలకాయలు కాస్త డబ్బున్నోళ్లుగా ఉంటారు. 'బి సెక్షన్' వాళ్లు రొంత పర్వాలేదు. సి.సెక్షన్ వాళ్లు చాలా కష్టం.

అందువల్ల సెప్టెంబర్ అయిదు సన్మానం వార్త బయటికి రాంగానే ఏ సెక్షన్‌వాళ్ళు ఎగురుకుంటా ఎగురుకుంటా వాళ్ల కిలాస్ టీచరు అయిన పిచ్చయ్య ఐవోరికి సన్మాన కార్యక్రమం ప్లానింగు మొదలుబెట్టేసినారు.

ఆ సంగతి తెలిసినా బిసెక్షన్‌వాళ్లు కిక్కురు మనడంలా.

మా సి సెక్షన్‌వాళ్లకి అసలా బాదే పట్టలా.

ఈ సంగతి బి.సుదాకర్ ఐవోరికి సి.సుదాకర్ ఐవోరికి మొత్తం మీద ఎట్టాగో తెలిసిపోయింది. వాళ్లకి మేము సన్మానం చెయ్యకపోతే కుమారస్వామి ఐవోరి ముందర వాళ్లకెంత నామోషి? బి.సుదాకర్ ఐవోరి సంగతేమోగానీ సి.సుదాకర్ ఐవోరి బాద యింకా ఎక్కువగా ఉంది. కిలాస్ టీచరుగా ఇస్కూలు మొత్తం మీద అందరికంటే ఎక్కువ కష్టం పడ్డ మనిషాయన. ఏ లెక్కన చూసినా సన్మానానికి అర్హుడు. కానీ బిసెక్షన్ వాళ్లు పూనుకుంటే గదా. అందుకని ఆయన మా సిసెక్షన్ నుంచి నరుక్కొనొచ్చినాడు.

మామూలుగా రావడంతోటే పాటం ఎత్తుకునే ఆ మనిషి ఆ రోజు టెక్స్టుబుక్కు పక్కన బెట్టి 'ఏరా? మీరు మీ బి.సుదాకర్ ఐవోరికి సన్మానం చేస్తున్నారా? లేదా?' అని కొసెనేసినాడు.

మేం పలకలా.

'మిమ్మల్నేరా?' అన్నాడు మళ్లీ.

'లేదు సార్'

'ఏం?'

'సన్మానం అంటే మాటలా? చాలా అవుతుంది సార్. ఒక దండ, ఒక పూలగుత్తి, ఒక గిఫ్టు. పిలకాయలందరికీ తీపీ కారా. కుదిర్తే సుగందపాల్. ఇయ్యన్నీ ఉండబళ్లేదా?' అన్నాడు కందుల మాలకొండరావు గాడు.

'ఎంతరా? మీరు యాబై మందున్నారు. తలా మూడు రూపాయలేసుకున్నా నూటేబై

రూపాయల్లో అంతా అయిపోతుంది. కావాలంటే ఎట్ల జెయ్యాలో ఏమి జెయ్యాలో చెప్తా. కిలాస్ టీచరుకి సన్మానం చెయ్యకపోతే ఎట్లరా? చెయ్యండి' అన్నాడు మమ్మల్ని బుజ్జగిస్తా.

'ఇప్పటికిప్పుడు తలా మూడు రూపాయలు దండేదానికి లేటవుద్ది సార్. ఇప్పుడు చెప్తే ఇంకో పదిరోజులకి గానీ మా యిళ్లల్లో యియ్యరు' అన్నాడు మా కిలాసులోని మనోహరుగాడు.

'పర్వాలేదులేరా. ఇప్పుడు కావాలంటే నాకాడ తీసుకోండి. ఆనేక దండి యిద్దురు గానీ' అన్నాడు.

అందరం మొకామొకాలు చూసుకుని 'సరే' అన్నాం.

సి.సుదాకర్ ఐవోరు మాకు నూటాభై రూపాయలు అప్పటికప్పుడు జేబులో నుంచి తీసి యిచ్చేశాడు.

కిలాస్ అయిపోయాక పోతా పోతా 'బి సెక్షన్ వాళ్లకి కూడా చెప్పండిరా. ఏ సెక్షన్ వాళ్లు చేసి, సిసెక్షన్ వాళ్లు చేసి బిసెక్షన్ వాళ్లు చెయ్యకపోతే బాగుండదని' అనేసి పొయ్యాడు.

ఆయన డావు పారింది.

మా రెండు సెక్షన్లని చూసి బిసెక్షన్‌వాళ్లు గూడా తలా మూడు రూపాయలు ఏసుకొని సన్మానం ప్లానింగు మొదలుబెట్టాడు.

మేము మా కాడున్న నూటాభై రూపాయలు తీసుకొని శ్రీరామా స్టోర్సులో డెబ్బయి అయిదు రూపాయలతో రౌండుగా తిరగతా ఉండే బెడ్‌లైటు, సింగు స్వీట్‌స్టాల్‌లో యాభై పాలకోవా బిళ్లలు, కేజీన్నర మిక్చరు, వరవకట్ట మీదుండే పూలంగళ్ల కాడ పూలదండా, చేతిలో పెట్టేదానికి గుత్తి కొని, తక్కిన డబ్బులతో రెండు రస్నా ప్యాకెట్లు, చెక్కర కొన్నాం.

సన్మానం అమిత గనంగా జరిగింది.

బి.సుదాకర్ ఐవోరు మా ప్రేమకి, అబిమానానికి ఉబ్బి తబ్బిబ్బయ్యి, కళ్లమ్మట నీళ్లు పెట్టుకొని, 'జీవులు రెండు రకములు. ఒకటి స్వతంత్ర జీవి. రెండు పరాన్న జీవి. మీరు పరాన్నజీవులుగా గాకుండా బతికినంతకాలం కష్టపడి స్వతంత్రజీవులుగా బతకండి' అని సైన్సుపాటం చెప్పి, కళ్లు తుడుచుకున్నాడు.

ఆ పక్కన బి సెక్షన్‌లో గూడా సి సుదాకర్ ఐవోరు, సంతోషం పట్టలాక చొక్కా టైటు చేసేసుకొని, మాటలు రాక, పిజిక్సు ఐవోరు గదా 'సమాజములో వేగము త్వరణము పెరిగిపోయినాయి. న్యూటను ప్రకారము ప్రతి క్రియకి ఒక ప్రతిక్రియ ఉండాలి. అయితే చెడుక్రియ ఎంత జరిగినా దానికి ప్రతిగా మంచిక్రియ జరగడం లా. మీరు పైకొచ్చి మంచి మంచి ప్రతిక్రియలు చెయ్యండి' అని ఆశీర్వదించినాడు.

సన్మానాలయ్యాక, ఇద్దరయివోర్లు తురాయి చెట్ల కింద జేరి, ఒకరి గిఫ్టులు యింకొకరికి చూపించుకొని యిళ్లకు పొయ్యారు.

రోజులు గడస్తా ఉన్నాయి. బి.సుదాకర్ ఐవోరు, సి.సుదాకర్ ఐవోరు కిలాసులకి వస్తా ఉన్నారు పోతా ఉన్నారు. సి.సుదాకర్ ఐవోరయితే కిలాస్ అయ్యాక అయిదు నిమిషాలు

ఎగ(స్టాగా నిలబడి పిలకాయల వొంక దిక్కులు చూసిపోతా ఉన్నాడు.

ఆయన నూటాబై రూపాయలు ఆయనకి యియ్యాలి గదా.

మేము యియ్యాల. అసలు దండితే గదా. దండాలన్నా ఎవరైనా ఇస్తే గదా.

'మావా. మా యింట్లో యిచ్చిన మూడు రూపాయలతో నాలుగు మార్నింగ్‌షోలు చూశాను మావా' అని ఒకడంటే, 'సైకిలు బాడిక్కి తీసుకొని ఆదివారం అంతా యమా తొక్కుకున్నాను మావా' అని ఇంకొకడు.

'మా యింట్లో అసలు యియ్యలేదు మామా. ఇస్తామన్నా నేను వొద్దన్నా. ఇంక దేనికి. సన్మానం అయిపోయిళ్లా' అని ఒకడంటే, 'ఐవోరికి సన్మానం చెయ్యాలంటే డబ్బులు దేనికి. ఇదిగో ఈ సొరకాయ తీసుకొని పో అని మా అమ్మ యిదిచ్చిందిరా' అని సొరకాయని తెచ్చినాడొకడు.

మా సెక్షన్‌లోని బాలుర సంక్షేమ హాస్టలు పిలకాయలైతే 'మీరే మాకు తలా మూడు రూపాయలు ఎదురియ్యండి' అన్నట్టుగా చూశారు మావంక.

మొత్తం మీద కిలాసు మొత్తానికి యాబై ఆరు రూపాయలు పోగయినాయి.

సి.సుదాకర్ ఐవోరు మా కిలాసుకు వొచ్చినప్పుడు 'సార్. ఏమీ అనుకోబాకండి సార్. నూటాబై రూపాయలకి ఈ డబ్బులే పోగయినాయి సార్' అని ఆయన చేతుల్లో రూపాయలు పావలాలు అర్ధరూపాయలు కుప్పగా పోసినాం.

ఆయన వాటన్నింటిని లెక్కబెట్టుకొని, దెబ్బకు వేగమూ త్వరణమూ మర్చిపోయి 'ఒరే. ఏందిది. మీ సెక్షను ఏది. మీ కిలాస్ టీచరు ఎవరు. నాకసలు సంబంధం ఏమైనా ఉందా. సన్మానం చేసినోళ్లు బాగున్నారు. చేయించుకున్నోడు బాగున్నాడు. గిఫ్టు బాగుంది. తీపి కారాలు బాగున్నాయి. మధ్యలో నేను తిన్నాను గదరా కండె. అబ్బా. బలే కొట్టారు గదరా దెబ్బా' అని ఆ చిల్లర మీద అట్టే వాలిపోయాడు.

■